సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 17 । జూలై । 2024



నేడు తొలి ఏకాదశి

హిందువులు ఎంతో విశిష్టంగా భావించే తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు. 8లో



నేడు సాగునీటి విడుదల

చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్ట్ నుంచి బుధవారం పంటలకు నీరు విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 30° / 25°

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం తర్వాత కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

నేడు పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా గోపూజ, అమ్మవారికి అష్టోత్తర కలశ పూజ నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. ఈ మేరకు కేశవాపురం, జగన్నాథపురానికి చెందిన మహిళలు తీసుకొచ్చే జలాలతో అమ్మవారికి అభిషేకం జరిపిస్తామని పేర్కొన్నారు. కాగా, ఆలయంలో ఈనెల 21వ తేదీన చండీహోమం నిర్వహించనున్నామని, భక్తులు రూ.2,516 చెల్లించి గోత్ర నామాలను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 98669 23261, 63034 08458 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

'నవోదయ'లో ప్రవేశాలకు నోటిఫికేషన్

కూసుమంచి: నవోదయ విద్యాలయాల్లో 2025–26 విద్యాసంవత్సరం ఆరో తరగతిలో ప్రవేశాలకు విద్యాలయ సమితి నోటిఫికేషన్ జారీచేసింది. ఈమేరకు కూసుమంచి మండలం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో ప్రవేశాలకు సైతం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో సెప్టెంబర్ 16వ తేదీ నాటికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

కేయూ ఈఈఈ హెచ్‌ఓడీగా జగన్మోహన్‌రాజు



నియామకపత్రం అందుకుంటున్న జగన్మోహన్‌రాజు

కొత్తగూడెంఅర్బన్: కాకతీయ విశ్వవిద్యాలయం ఈఈఈ విభాగాధిపతిగా కొత్తగూడెం కాలేజ్ ఆఫ్ మైనింగ్ ప్రిన్సిపాల్ జగన్మోహన్ రాజు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, ప్రొఫెసర్ మల్లారెడ్డి జగన్మోహన్‌రాజుకు నియామకపత్రం అందజేశారు. కేయూ వ్యాప్తంగా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ విభాగానికి జగన్మోహన్‌రాజు హెచ్‌ఓడీగా వ్యవహరించనున్నారు.

అత్యవసర సేవలు వినియోగించుకోవాలి



వాహనంలో తనిఖీ చేస్తున్న ప్రణయ్‌కుమార్

జూలూరుపాడు: 108, 102 వాహనాలు అందిస్తున్న సేవలను అవసరమైన ప్రజలు వినియోగించుకోవాలని ఎమర్జెన్సీ మెడికల్ ఎగ్జిక్యూటివ్ జిల్లా అధికారి ఏలేటి ప్రణయ్‌కుమార్ కోరారు. మంగళవారం ఆయన జూలూరుపాడు పీహెచ్‌సీలోని 108, 102 అత్యవసర సేవల వాహనాలను తనిఖీ చేశారు. 108 వాహనంలో పరికరాల పనితీరు, మందుల కాలపరిమితిని పరిశీలించారు. వాహన రికార్డులు పరిశీలించి సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో పలువురు పాముకాటు బారిన పడుతున్నారని, క్షణికావేశంలో పురుగు మందు తాగుతున్నారని, అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈఎంటీ రవి, పైలట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిండికేట్‌కు కసరత్తు..



ఇల్లెందులో ఎక్సైజ్ శాఖ ఎత్తులు, జిత్తులు

- వైన్స్ యజమానుల మధ్య అవగాహనకు విశ్వ ప్రయత్నాలు
- వ్యాపారం ఒక్కరికే అప్పగించాలంటూ ఒత్తిడి
- ప్రతిఫలంగా ప్రతీ షాప్‌నకూ రేటు ఫిక్స్ చేసిన వైనం
- మామూళ్ల మజానే కారణమనే ఆరోపణలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లెందు లిక్కర్ వార్‌లో ఇటు ఎక్సైజ్ అధికారులు, అటు రాజకీయ ఒత్తిళ్ల మధ్య చిక్కుకున్న మద్యం వ్యాపారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. 'ముందు నుయ్యి వెనుక గొయ్యి' అన్నట్టుగా తమ పరిస్థితి మారిందంటున్నారు.

ఏకఛత్రాధిపత్యం..

ఇల్లెందులో సిండికేట్‌గా ఏర్పడకపోవడంతో జిల్లాలో ఇతర ప్రాంతాలతో పోల్చితే ఇక్కడ మద్యం తక్కువ ధరకే లభిస్తోంది. పైగా పాపులర్ బ్రాండ్లు కూడా అందుబాటులో ఉంటున్నాయి. దీంతో ఇల్లెందులో కూడా లిక్కర్ సిండికేట్ ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖకు చెందిన కొందరు సిబ్బంది విశ్వప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు ఇప్పటికే చక్కర్లు కొడుతున్నాయి. అయితే ఇక్కడ నెలకొన్న రాజకీయ పరిస్థితుల కారణంగా ఎక్సైజ్ శాఖ నుంచి వచ్చిన సిండికేట్ ప్రతిపాదనలకు లిక్కర్ వ్యాపారుల నుంచి సుముఖత వ్యక్తం కాలేదు. దీంతో లైసెన్స్ దక్కించుకున్న వారంతా తమ వ్యాపారాన్ని ఒకరికే అప్పగించాలని, అందుకు తగిన ప్రతిఫలం దక్కుతుందని సరికొత్త ప్రతిపాదన తెరపైకి తెచ్చినట్టు తెలుస్తోంది. అంతేకాదు.. వ్యాపారాన్ని ఎవరి గుప్పిట్లో ఉంచాలనే అంశాన్ని సైతం అబ్కారీలో పని చేస్తున్న కొందరు సిబ్బందే నిర్ణయిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

రూ. కోటికి కుదిరిన డీల్..

ప్రస్తుతం ఇల్లెందులో ఎనిమిది వైన్స్ ఉన్నాయి. తాజా ప్రతిపాదనల ప్రకారం వీరంతా రాబోయే రోజుల్లో తమ మద్యం దుకాణాల్లో జరిగే క్రయవిక్రయాలపై అజమాయిషీని.. ఈ వ్యాపారంలో ఇప్పటికే ఘనాపాటిగా వెలుగొందుతున్న ఓ రాజకీయ ప్రముఖుడికి అప్పగించాలి. దీనికి బదులుగా మద్యం లైసెన్స్ గడువులో ఇంకా మిగిలి ఉన్న సమయం, ఆయా ప్రాంతాల వారీగా జరిగే వ్యాపారం ఆధారంగా ప్రతీ వైన్‌షాప్‌నకు లెక్క కట్టినట్టు తెలుస్తోంది. ఈ ధర కనిష్టంగా రూ.80 లక్షల నుంచి గరిష్టంగా రూ.1.20 కోట్ల వరకు ఉన్నట్టు సమాచారం. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే మద్యం వ్యాపారులంతా తమ దుకాణాలను సదరు బడా నేతకు అప్పగించి పక్కకు తప్పుకోవాల్సి ఉంటుంది.

మామూళ్ల కోసమేనా?

వైన్‌షాపుల నుంచి ఆబ్కారీ శాఖలో కొందరు సిబ్బంది నెలవారీ మామూళ్ల వసూలు చేస్తారనేది బహిరంగ రహస్యం. ప్రస్తుతం ఇల్లెందులో జరిగే వ్యాపారం ఆధారంగా ఒక్కో షాపు కనీసం రూ.45,000 నెలవారీ మామూలు సమర్పించుకోవాల్సి ఉంది. అయితే కొత్త ప్రతిపాదనల ప్రకారం లిక్కర్ బిజినెస్‌లో సిండికేట్/ఏకఛత్రాధిపత్యం అమల్లోకి వచ్చిన మరుసటి నెల నుంచి ప్రతీ షాపు నుంచి నెలవారీగా వచ్చే మామూలును రూ.45,000 నుంచి రూ.85,000కు పెంచాలని హుకుం జారీ చేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. అంతేకాదు.. ఈ డీల్ సెట్ చేసినందుకు ప్రతీషాపు నుంచి గుడ్‌విల్‌గా రూ.నాలుగు లక్షలు కూడా ముట్టజెప్పాలనే అంశాన్ని ఈ ఒప్పందంలో పొందుపరచడం గమనార్హం.

ముప్పు తిప్పలు తప్పవు !

కారణాలు ఏమైనప్పటికీ సిండికేట్ లేకపోవడంతో తమ వ్యాపారాలు బాగున్నాయనే భావన ఇక్కడి వ్యాపారుల్లో నెలకొంది. అధిక ధరలకు అమ్మకపోయినా పెరుగుతున్న విక్రయాలతో గల్లా పెట్టె గలగలలాడుతుందనే నమ్మకం ఉందని అంటున్నారు. కానీ నెలవారీ మామూళ్లలో హెచ్చు కోసమే తమను ఈ సిండికేట్ ఊబిలోకి ఆబ్కారీ సిబ్బంది లాగుతున్నారనే అసంతృప్తి లిక్కర్ వ్యాపార వర్గాల్లో నెలకొంది. అయితే ఆబ్కారీ నుంచి వచ్చిన ప్రతిపాదనను తిరస్కరించి, ఈ వ్యాపారంలో మనగలిగే పరిస్థితి లేదనే భయం మరోవైపు వారిని వెంటాడుతోంది. అందువల్లే ఈ విషయాన్ని బహిరంగంగా బయటకు చెప్పలేక, లోపల దాచుకోలేక సతమతం అవుతున్నారు.

మా విధులు మేం నిర్వర్తిస్తున్నాం

ఆబ్కారీ సిబ్బందికి మామూళ్లు అందుతాయనేది కేవలం అపోహే. మామూళ్ల వసూలు అంటూ మా మీద అసత్య ఆరోపణలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా మద్యం అమ్మకాలను పర్యవేక్షించడం, లక్ష్యం చేరేలా చూడటం మా విధి. ఆ పనే మేం చేస్తున్నాం.

– జానయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్

సీఎం సమీక్షలో కలెక్టర్, ఎస్పీ



హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్ పాల్గొన్నారు. – సూపర్‌బజార్(కొత్తగూడెం)

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్య తప్పదు



మాట్లాడుతున్న భాస్కర్‌నాయక్

కొత్తగూడెంరూరల్ : లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి భాస్కర్‌నాయక్ హెచ్చరించారు. స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం 1994 యాక్ట్‌కు సంబంధించిన అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఈ చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, సరైన కారణం లేకుండా అబార్షన్ చేసినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో పీఓఎంసీహెచ్ డాక్టర్ చైతన్య, డాక్టర్ అనూష, న్యాయవాది పార్వతి, డాక్టర్ కొప్ర శ్రీయాదవ్, ఎండీ అజ్గర్ హుస్సేన్, డీపీఆర్‌ఓ ఎండీ ఫయాస్ మోహిద్దీన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పి.శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, బేబీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శుభవార్త

రిటైర్‌మెంట్ బెనిఫిట్ పెంపుతో జిల్లాలో 180 మందికి లబ్ధి

కొత్తగూడెంటౌన్: అంగన్‌వాడీల పోరాటం ఫలించింది. రిటైర్‌మెంట్ బెనిఫిట్ పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించడంతో వారిలో హర్షం వ్యక్తమవుతోంది. ఉద్యోగ విరమణ తర్వాత టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు ఇస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. అయితే, ఏళ్ల తరబడి పనిచేసిన తాము ఇంత తక్కువ మొత్తంతో జీవనం సాగించడం కష్టమని, టీచర్‌కు రూ.5 లక్షలు, ఆయాలకు రూ.2 లక్షలు ఇవ్వాలనే డిమాండ్‌తో టీచర్లు, ఆయాలు ఆందోళనలు చేపట్టారు. ఈనెల 15వ తేదీ నుంచి కలెక్టరేట్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన తెలపడమే కాక ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ నేపథ్యాన రిటైర్‌మెంట్ బెనిఫిట్‌ను టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇవ్వనున్నట్లు మంత్రి సీతక్క మంగళవారం ప్రకటించారు. ఈ అంశంపై గతంలో జారీ చేసిన జీఓ రద్దు చేసి కొత్త జీఓ విడుదల చేయనున్నట్లు తెలిపారు. దీంతో అంగన్‌వాడీల్లో హర్షం వ్యక్తమవుతోంది. కాగా, జిల్లాలో 2,060 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా.. టీచర్లు, ఆయాలు కలిసి 4,120 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో 65 ఏళ్లు దాటిన 180 మందికి పైగా టీచర్లు, ఆయాలు రిటైర్ కానున్న నేపథ్యాన కొత్త జీఓ ప్రకారం లబ్ధి జరగనుంది. ఈమేరకు ప్రభుత్వ ప్రకటనపై అంగన్‌వాడీ టీచర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గోనె మణి మాట్లాడుతూ టీచర్లు, ఆయాలకు ఇచ్చే నగదు మొత్తాన్ని పెంచడం హర్షణీయమని తెలిపారు.

ఫోర్బ్స్ ఇండియా మ్యాగ్జైన్‌లో పాల్వంచ వాసికి స్థానం



మధుసూదన్ రెడ్డి

పాల్వంచ: పాల్వంచలోని కేఎల్ఆర్ విద్యాసంస్థల సెక్రటరీ వై.మధుసూదన్‌రెడ్డికి అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఫోర్బ్స్ ఇండియా మ్యాగజైన్‌లో స్థానం లభించింది. ఫార్మా రంగంలో బెల్ ఫార్మాస్యూటికల్ కంపెనీ చైర్మన్‌గా, శిరో ఫార్మా డైరెక్టర్‌గా ఎదిగిన ఆయన యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. మరోపక్క సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటూ స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. రాష్ట్రంలో ప్రముఖ వ్యాపారవేత్తగా గుర్తింపు తెచ్చుకోవడంతో మధుసూదన్‌రెడ్డికి ఫోర్బ్స్ ఇండియా మ్యాగజైన్‌లో స్థానం లభించింది. ఈసందర్భంగా పాల్వంచ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతు రుణమాఫీలో షరతులు వద్దు..

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

మధిర: ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం రైతుల రుణమాఫీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా మధిర మండలం దెందుకూరులో జరుగుతున్న సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో మంగళవారం ఆయన మాట్లాడారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కొర్రీలు విధించడం సరికాదన్నారు. ఇక రుణమాఫీలో కౌలు రైతులకు ప్రభుత్వం తీరని నష్టం చేస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన ఆశించిన స్థాయిలో లేదని ఆయన అభిప్రాయపడ్డారు. త్వరలో బడ్జెట్ సమావేశాల్లో విద్య, వైద్య రంగానికి అధిక నిధులు కేటాయించాలని, గ్రామసభల ద్వారా కౌలు రైతులను ఎంపిక చేసి రైతు భరోసా ఇవ్వాలని కోరారు. ఇప్పటికే ఖరీఫ్ పనులు జోరుగా సాగుతున్నందున తక్షణమే రైతు భరోసా విడుదల చేయాలని తమ్మినేని డిమాండ్ చేశారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించిన తమ్మినేని.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తే సీపీఎం వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలో వామపక్షాల, ప్రజా సంఘాల ఐక్యవేదిక నిర్మించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. కాగా, సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు సాగునీరు అందించేందుకు పాత డిజైన్ ప్రకారమే పూర్తి చేయాలని, ప్రాజెక్టుల నిర్మాణంతో భూములు కోల్పోయిన రైతులకు మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్, అక్టోబర్‌లలో జరిగే అవకాశమున్నందున సీపీఎం శ్రేణులు సిద్ధంగా ఉండాలని తమ్మినేని కోరారు. సమావేశంలో నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యంత్రలక్ష్మికి గ్రహణం

- రాయితీ పరికరాలకు ఇక రాంరాం..
- వ్యవసాయ యాంత్రీకరణపై నిర్లక్ష్యం
- ఏడేళ్లుగా నిలిచిన యంత్రలక్ష్మి పథకం
- రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువు




యంత్రంతో వరి నాటు వేస్తున్న రైతులు

బూర్గంపాడు: ప్రస్తుతం పంటల సాగులో యాంత్రీకరణ కీలకంగా మారింది. నూతన సాగు పద్ధతులను అవలంబించడంతో పాటు కూలీల కొరతను అధిగమించేందుకు ఇది ఏకైక మార్గంగా ఉంది. సాగులో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రాయితీపై పలు రకాల యంత్రాలను అందించారు. యంత్రలక్ష్మి, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన తదితర పథకాల కింద 50 శాతం రాయితీతో ట్రాక్టర్లు, కల్టివేటర్లు, రొటోవేటర్లు, పవర్ టిల్లర్లు, నాగళ్లు, దమ్ము చక్రాలు, డ్రిప్ స్ప్రింక్లర్లు, హార్వెస్టర్లు, డ్రోన్లు, పవర్ స్ప్రేయర్లు, హ్యాండ్ స్ప్రేయర్లు అందించారు. అయితే ప్రస్తుతం ఆ పథకానికి గ్రహణం పట్టింది. గత ఆరు సంవత్సరాలుగా ప్రతీ సీజన్‌లో రాయితీ పనిముట్లు అందుతాయని రైతులు ఆశగా ఎదురుచూడడం, ఆ తర్వాత నిరాశకు లోనవడం పరిపాటిగా మారింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు లేకపోవడంతో తామేమీ చేయలేమని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు.

కూలీల కొరతతో ఇక్కట్లు..

జిల్లాలో సుమారు 5.40 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా పత్తి, వరి, మిర్చి, మొక్కజొన్న, కూరగాయల పంటలు సాగవుతున్నాయి. ఈ పంటల సాగులో రైతులకు కూలీల కొరత ప్రతిబంధకంగా మారుతోంది. దీంతో యాంత్రీకరణ వైపు అడుగులు వేస్తున్నారు. అయితే ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేయలేకపోతున్నారు. గతంలో నాగళ్లతో భూములు దున్నేందుకు ఎద్దులను వినియోగించేవారు. ప్రస్తుతం జిల్లాలో 90శాతం మేర భూములు ట్రాక్టర్లతోనే దున్నుతున్నారు. పంటల సాగులో పశువుల వినియోగం పూర్తిగా తగ్గిపోయింది. ఇక సస్యరక్షణ చర్యలకు పవర్ స్ప్రేయర్లు, డ్రోన్ స్ప్రేయర్ల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. వరినాటు, కోత యంత్రాల అవసరాలు కూడా బాగా పెరిగిపోతున్నాయి. అయితే రూ.లక్షలు వెచ్చించి యంత్రాలు కొనుగోలు చేయడం రైతులకు భారంగా మారుతోంది. ప్రభుత్వం రాయితీపై పరికరాలు అందిస్తే తప్ప కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఈ పరిస్థితులను గుర్తించి ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందించాలని రైతులు కోరుతున్నారు.

పేద రైతులను ప్రోత్సహించాలి



రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందించాలి. గతంలో కొంతమంది రైతులకు సబ్సిడీపై యంత్రాలు అందించారు. ఏడెనిమిది ఏళ్ల నుంచి రైతులకు ఎలాంటి రాయితీలు అందించడం లేదు. ఈ ప్రభుత్వమైనా వ్యవసాయ పనిముట్లను రాయితీపై అందించేందుకు చర్యలు తీసుకుని పేద రైతులను ప్రోత్సహించాలి.

– దారం రాజశేఖర్ రెడ్డి, రైతు, సంజీవరెడ్డిపాలెం

జెడ్పీలో ముగిసిన బదిలీల ప్రక్రియ



బదిలీల ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సీఈఓ చంద్రశేఖర్

చుంచుపల్లి: జిల్లా ప్రజా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది బదిలీ ప్రక్రియను మంగళవారం జెడ్పీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పర్యవేక్షణలో చేపట్టారు. జిల్లా పరిషత్ పరిధిలో మొత్తం 205 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, వారిలో 114 మందికి నాలుగేళ్ల కాలపరిమితి పూర్తయింది. ఇందులో 96 మందికి బదిలీల్లో అవకాశం కల్పించారు. ఓపెన్ కౌన్సెలింగ్ విధానంలో ఈ ప్రక్రియ కొనసాగగా.. ఇద్దరు ఎంపీడీఓలు, ఐదుగురు సూపరింటెండెంట్‌లు, ఎనిమిది మంది సీనియర్ అసిస్టెంట్లు, 22 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఆరుగురు టైపిస్టులు, 14 మంది రికార్డ్ అసిస్టెంట్లు, 38 మంది ఆఫీస్ సబార్డినేట్‌లు, ఒక నైట్ వాచ్‌మెన్‌కు బదిలీ అయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ప్రక్రియ కోలాహలంగా కొనసాగింది. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. ఇక జిల్లా అటవీ శాఖలోనూ 188 మంది సిబ్బందికి బదిలీల్లో భాగంగా స్థానచలనం కల్పించారు. బదిలీ అయిన వారిలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు, డ్రైవర్లు, వాచ్‌మెన్‌లు ఉన్నారు.

కలెక్టరేట్‌లో..

సూపర్‌బజార్(కొత్తగూడెం): బదిలీల ప్రక్రియలో భాగంగా కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు కలెక్టర్(రెవెన్యూ) వేణుగోపాల్ పది ప్రభుత్వ శాఖల సిబ్బందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. వ్యవసాయ, సహకార, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, ఆర్అండ్‌బీ, రెవెన్యూ, వెటర్నరీ, పంచాయతీ, ట్రెజరీ, విద్యాశాఖలకు సంబంధించి నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సుమారు 360 మంది పాల్గొన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. కౌన్సెలింగ్ నివేదికను కలెక్టర్‌కు అందజేసిన తర్వాత ఈనెల 19న బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. మిగిలిన ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు 18న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ గన్యా ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భద్రాచలం ఐటీడీఏలో..



కౌన్సెలింగ్‌ను పర్యవేక్షిస్తున్న డీడీ మణెమ్మ

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లోని బోధనేతర సిబ్బంది బదిలీలను పారదర్శకంగా పూర్తి చేసినట్లు ఐటీడీఏ డీడీ మణెమ్మ తెలిపారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం జూనియర్ అసిస్టెంట్లు, డ్రైవర్లు, రికార్డ్ అసిస్టెంట్లు, నాలుగో తరగతి ఉద్యోగులు, కుక్, కామాటి, వాచ్‌మెన్లకు బదిలీ ప్రక్రియ చేపట్టారు. ఈ మేరకు డీడీ మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం 81 మందిని బదిలీ చేయగా, దంపతులు, దివ్యాంగులు, అనారోగ్య కారణాలు, వితంతు మహిళలకు ముందుగా ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. మొత్తంగా జూనియర్ అసిస్టెంట్లు 15 మందిలో తొమ్మిది మంది, రికార్డ్ అసిస్టెంట్లు 14 మందిలో తొమ్మిది మంది, ఆఫీస్ సబార్డినేట్లు 24 మందికి 15 మంది, కుక్, కామాటీల్లో 34 మందికి 19 మంది, వాచ్‌మెన్లు 16 మందికి గాను 12 మందితో పాటు ఇద్దరు డ్రైవర్లను బదిలీ చేశామని వెల్లడించారు. ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ నర్సింహారావు, ఉద్యోగులు చంద్రమోహన్, రాధమ్మ, ప్రమీలబాయి, రమణమూర్తి, నారాయణ, రంగయ్య, అశోక్, సురేశ్, శ్రీధర్, శేఖర్, రమణ, రమాదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ల అప్రమత్తతకే 'ఎల్లో కార్డ్'

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గనుల్లో ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్లు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తే ప్రమాదాలు జరగవని, వీరిని అప్రమత్తం చేసేందుకే ఎల్లో కార్డ్‌ల జారీకి నిర్ణయించినట్లు కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య తెలిపారు. సూపర్‌వైజర్లు సిబ్బందితో రక్షణతో కూడిన పనులు చేయించాల్సిన బాధ్యతను విస్మరిస్తే వారికి పైఅధికారి ఎల్లో కార్డ్ అందజేస్తారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, కొందరు సూపర్‌వైజర్లు రెండు రోజుల్లో సుమారు 297 మంది కార్మికులకు ఈ కార్డులు అందజేశారని తెలిపారు. దీంతో ఈ నెల 9వ తేదీన కొత్తగూడెంలో సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్‌కు సంబంధించి వర్క్‌షాప్ నిర్వహించి కార్డుల జారీ ఉద్దేశాన్ని వివరించినట్లు వెల్లడించారు. కాగా, ఈ విధానం అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే దశల వారీగా అధికారులు తమ కిందిస్థాయి ఉద్యోగులకు ఎల్లో కార్డ్ జారీ చేయనుండటంతో బాధ్యతగా విధులు నిర్వర్తించే అవకాశముందని జీఎం చెప్పారు. కాగా, గనుల్లో పనిచేసే సూపర్‌వైజర్లు రోజూ గనిలోకి దిగాలని, మేనేజర్ సైతం వారంలో నాలుగు రోజులు గనిలోకి దిగాల్సి ఉన్నా కొందరు పట్టించుకోకపోవడంతో ఎల్లో కార్డ్ విధానానికి శ్రీకారం చుట్టామని తెలిపారు.

పంచాయతీ కార్మికులకు ఊరట

ఇల్లెందురూరల్: వేతనాలు లేక నెలల తరబడి వేచిచూస్తున్న గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు ప్రభుత్వ నిర్ణయం ఊరటనిచ్చింది. జిల్లావ్యాప్తంగా కేవలం పంచాయతీ కార్మికుల వేతనాల పేరిట రూ.1,48,67,500 నిధులను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. గ్రామ పంచాయతీల్లో ఖజానా ఖాళీ కావడంతో నాలుగు నెలలుగా జిల్లావ్యాప్తంగా కొన్ని గ్రామ పంచాయతీల్లో కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదు. దీనిపై కార్మిక సంఘాలు పలు రూపాల్లో నిరసన వ్యక్తం చేశాయి. స్పందించిన ప్రభుత్వం మేనెలలో ఖజానా ఖాళీగా ఉన్న 280 జీపీలను గుర్తించి, రెండు నెలలకు సరిపడా నిధులు విడుదల చేసింది. ఆయా నిధులను కేవలం పంచాయతీ కార్మికుల వేతనాలకు మాత్రమే వినియోగించాలని, తక్షణం ట్రెజరీ ద్వారా వేతనాలను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



ఫోన్ అందిస్తున్న ఎస్‌ఐ రాజేందర్

కరకగూడెం: మండలంలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న రెండు మొబైళ్లను గుర్తించి బాధితులకు మంగళవారం అందించారు. ఎస్‌ఐ రాజేందర్ కథనం ప్రకారం.. కరకగూడేనికి చెందిన రావుల సోమయ్య, ముత్తారం గ్రామానికి చెందిన గోపి తమ ఫోన్లను పోగొట్టుకున్నారు. బాధితులు ఐఎంఈఐ నంబర్ ద్వారా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి, హైదరాబాద్, తాడ్వాయికి చెందిన వ్యక్తుల నుంచి రెండు ఫోన్లు రికవరీ చేసి, బాధితులకు అందించామని ఎస్‌ఐ వివరించారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఇల్లెందురూరల్: మండలంలోని బోయితండాకు చెందిన గుగులోత్ సుగుణ (58) మంగళవారం రాత్రి కలుపుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కొంతకాలంగా దిగాలుగా ఉంటున్న సుగుణ రాత్రి ఆరుబయట కలుపుమందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను కొమరారం ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

హాస్టల్‌కు వెళ్లలేనని బాలిక..



నిహారిక (ఫైల్)

గుండాల: హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేక ఓ విద్యార్థిని పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సాయనపల్లి గ్రామానికి చెందిన తోలెం నిహారిక (12) స్థానిక కస్తూర్బా విద్యాలయంలో 8వ తరగతి చదువుతోంది. శనివారం ఇంటికి వెళ్లగా సోమవారం హాస్టల్‌కు వెళ్లాలని తల్లిదండ్రులు సూచించారు. హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేక మంగళవారం తెల్లవారుజామునే పురుగులమందు తాగడంతో ఆమెను గుండాల ఆస్పత్రికి.. అక్కడి నుంచి కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించా రు. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్‌ఐ రాజమౌళి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.


బంగారం చోరీపై ఫిర్యాదు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని మెడికల్ కాలనీలో నివాసముంటున్న ఓ వైద్యురాలి ఇంట్లో బంగారం చోరీ జరిగినట్లు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, సదరు వైద్యురాలు భద్రాచలంలోని ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్నట్లు సమాచారం.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.13,705

విశిష్ట పర్వదినం.. తొలి ఏకాదశి





నేడు హిందువుల తొలి పండుగ

- శ్రీమహా విష్ణువు యోగనిద్రలోకి వెళ్లే రోజు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- నేటి నుంచి చాతుర్మాస వ్రతాలు ప్రారంభం

ఖమ్మంగాంధీచౌక్/కొత్తగూడెంటౌన్: ఆనందంతో పాటు ఆరోగ్యాన్ని ఇచ్చే పండుగ తొలి ఏకాదశి. హిందువులు భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఈ ఏకాదశికి హైందవ సంస్కృతిలో విశేష స్థానం ఉంది. ఏడాది కాలంలో 24 ఏకాదశులు వస్తాయి. అందులో బుధవారం వచ్చే ఆషాఢ శుద్ధ ఏకాదశిని 'తొలి ఏకాదశి'గా పిలుస్తారు. పురాణాల ప్రకారం.. శ్రీమహావిష్ణువు నేటి నుంచి నాలుగు నెలల పాటు క్షీరసాగరంలో శేషతల్పంపై శయనిస్తాడు. అందుకే దీన్ని శయన ఏకాదశి అని కూడా అంటారు. ఇక ప్రత్యక్ష దైవమైన సూర్యుడు దక్షిణం వైపునకు మరలినట్లు, ఈరోజు నుంచి దక్షణాయనం ప్రారంభమవుతుంది. ఈ ఏకాదశి రోజున కొందరు చాతుర్మాస వ్రతాలు ప్రారంభిస్తారు. గోపద్మవ్రతం కూడా ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని కార్తీక మాస శుక్లపక్షం వరకు జరుపుకుంటారు. ఏకాదశి రోజున సూర్యోదయానికి ముందే శ్రీహరిని పూజించి, విష్ణుమూర్తి ప్రతిమను పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి చక్కెర పొంగళి నైవేద్యం పెట్టి కర్పూర హారతులివ్వటం ఆనవాయితీ. భక్తులు నేడు ఉపవాసం ఉంటూ, వైష్ణవ ఆలయాలను సందర్శిస్తుంటారు. ఈ మేరకు అర్చకులు ఆలయాలను శుభ్రం చేసి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఏర్పాట్లు చేశారు.

పేలాల పిండి నైవేద్యం..

తొలి ఏకాదశి పేలాల పిండికి ప్రత్యేకం. ఈ పిండిని శ్రీ మహావిష్ణువుకు నైవేద్యం పెట్టి తప్పక తినాలని అంటారు. పేలాలు పితృ దేవతలకు కూడా ఎంతో ఇష్టమైనవని, జన్మనిచ్చిన వారిని ఈ రోజున గుర్తు చేసుకోవడం బాధ్యత అని పెద్దలు చెబుతుంటారు. అంతేగాక ఉష్ణోగ్రతలకు అనుగుణంగా శరీరంలో అనేక మార్పులు వస్తుంటాయి. గ్రీష్మ రుతువు ముగిసి, వర్ష రుతువు ప్రారంభమయ్యే ఈ కాలంలో పేలాల పిండి తింటే ఆరోగ్యానికి మంచిదని అంటుంటారు.

రైతులకు ప్రత్యేకం..

తొలి ఏకాదశి రైతుల పండుగగా పురాణాలు చెబుతున్నాయి. రైతులు ఈ పండుగను వేడుకలా జరుపుకుంటారు. అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా, పంటలకు ఎలాంటి తెగుళ్లు ఆశించకుండా ఉండాలని కోరుకుంటూ తొలి ఏకాదశి రోజున ఇళ్లు, ఆలయాల్లో పూజలు చేస్తారు. 'ఏరు ముందా.. ఏకాశి ముందా..' అని చర్చించుకుంటారు. వర్షాలు అనుకూలించి పంటలు సమృద్ధిగా పండాలని రైతులు భగవంతుడిని ప్రార్థిస్తారు.

మార్పులకు సంకేతం



ప్రకృతిలో జరిగే మార్పులకు సంకేతం తొలి ఏకాదశి. సూర్య భగవానుడు ఈ రోజు నుంచి దక్షణాయనం వైపునకు మరలుతాడు. హిందువులు తొలి ఏకాదశిని మొదటి పండుగగా జరుపుకుంటారు. రైతులకు ఈ పండుగ ప్రత్యేకం. పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని ప్రజలు తొలి ఏకాదశి రోజున ఉపవాసాలు, జాగరణలు చేస్తారు.

– నందుల సుబ్రమణ్య శర్మ, పురోహితులు, ఖమ్మం

ఏకాదశి వ్రత పూజతో పుణ్యఫలం



సూర్య గమనం తూర్పు నుంచి దక్షిణాయానానికి జరుగుతుంది కాబట్టి ఈ సమయాన్ని దక్షణాయాన కాలం అంటారు. తొలి ఏకాదశి శ్రీమహావిష్ణువు, లక్ష్మీదేవిలకు ఇష్టమైన పండుగ కావడంతో ఈ రోజు పూజలు చేస్తే పాపాలు తొలగి పుణ్యఫలం లభిస్తుంది. ఉపవాసం ఉండి దానధర్మాలు చేస్తే మోక్షం సిద్ధిస్తుంది.

– అరుణానందస్వామి, శ్రీవిద్యా ఉపాసకులు, రామవరం

నేడు పీరీల పండుగ

కొత్తగూడెంటౌన్: ముస్లింలు మొహర్రం(పీరీల పండుగ)ను బుధవారం జరుపుకోనున్నారు. ఈమేరకు పీరీలను ముస్తాబు చేసి అషుర్‌ఖానాల్లో సిద్ధంచేశారు. హజరత్ ఇమామ్ హుస్సేన్‌ను స్మరించుకునేందుకు పీరీల పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా పీరీలతో ఇంటింటికీ వెళ్లనుండగా ప్రజలు కులమతాలకతీతంగా మొక్కులు చెల్లించి ఆశీర్వాదం తీసుకుంటారు.

ఒకే రోజు రెండు పండుగలు..

హిందువుల ఘనంగా జరుపుకునే తొలి ఏకాదశితో పాటు ముస్లింల పండుగల్లో ప్రధానమైనదిగా భావించే పీరీల పండుగ బుధవారమే వచ్చాయి. ఏకాదశి పండుగ సందర్భంగా ఆలయాల్లో పూజలకు ఏర్పాట్లు చేయగా, పీరీలను ఊరేగింపునకు ముస్తాబు చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా బుధవారం సందడి నెలకొననుంది.

తాలిపేరు నుంచి నేడు సాగునీటి విడుదల



మామిడిగూడెంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

చర్ల: మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టులో రోజురోజుకూ నీటిమట్టం పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి వరద వచ్చి చేరుతుండగా 74 మీటర్ల పూర్తిస్థాయి నీటిమట్టానికి గాను మంగళవారం 72.75 మీటర్లకు చేరింది. దీంతో కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా పంటల సాగుకు బుధవారం సాగునీరు విడుదల చేయాలని నిర్ణయించినట్లు ఈఈ రాంప్రసాద్ తెలిపారు. ఎడమ ప్రధాన కాల్వ కింద చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని 34 డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లకు, కుడి ప్రధాన కాల్వ కింద చర్ల మండలంలో ఉన్న ఎనిమిది డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లకు నీరు విడుదలవుతుందని వెల్లడించారు.

ఇప్పటికే వరినాట్లు

చర్ల మండలంలో ఇప్పటికే వరి నాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎగువన కురుస్తున్న వర్షాలతో తాలిపేరు ప్రాజెక్టులోకి నీరు చేరుతుండగా జూన్ మొదటి వారంలో నార్లు పోసిన రైతులు నాట్లు వేయడం మొదలుపెట్టారు. చర్ల మండలంలోని మామిడిగూడెం, దేవరాపల్లి, ఆర్.కొత్తగూడెం, పెద్దిపల్లి, జెట్టిగూడెం, తొమ్ముగూడెం, కొత్తగట్ల, జీపీపల్లి, వీరాపురం, చినమిడిసిలేరు, పెదమిడిసిలేరు తదితర గ్రామాల్లో వరి నాట్లు జోరందుకున్నాయి. ఇక బుధవారం ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయనుండటంతో సాగు పనులు మరింత ఊపందుకోనున్నాయి.

ఉపాధి హామీ పనులపై 'ప్రజావేదిక'



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

కరకగూడెం: మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024, మార్చి 31 వరకు ఉపాధి హామీ పథకం, అటవీశాఖలో జరిగిన పనులపై 3వ విడత సామాజిక తనిఖీల్లో గుర్తించిన అవకతవకలపై అధికారులను డీఆర్‌డీఓ రవి ప్రశ్నించారు. మంగళవారం మండలంలోని భట్టుపల్లి రైతువేదికలో డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అధికారి రమణారావు, అంబుడ్స్‌మెన్ అధికారి నాగప్రకాశ్, క్వాలిటీ కంట్రోల్ ఏఈ అనిల్‌కుమార్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి అనూష ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక తనిఖీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. రూ.2.46 కోట్ల నిధులతో జరిగిన పనుల్లో అవకతవకలపై సంబంధిత అధికారులను నిలదీశారు. మొత్తం పెనాల్టీ రూ.15 వేలు, రూ.35 వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దేవవరకుమార్, ఏపీఓ శ్రీను, ఎంపీపీ రేగా కాళిక, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సిమ్ మేళాకు స్పందన



వినియోగదారులకు సిమ్ కార్డులు అందిస్తున్న సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత సిమ్ మేళాకు అనూహ్య స్పందన లభించిందని బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు తెలిపారు. ఐదు రోజులుగా ఈ మేళా నిర్వహిస్తుండగా 400 మంది కొత్త మొబైల్ వినియోగదారులు సిమ్‌లు తీసుకున్నారని, 150 మంది ఇతర నెట్‌వర్క్ నుంచి బీఎస్‌ఎన్‌ఎల్‌లోకి మారారని చెప్పారు. రూ.108కి 28 రోజులు అన్ లిమిటెడ్ కాల్స్, రోజూ 1 జీబీ డేటా, 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయని పేర్కొన్నారు. రూ. 249కి 45 రోజుల పాటు అన్ లిమిటెడ్ కాల్స్, రోజూ 2 జీబీ డేటా, 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయని తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఈ సుభాష్, ఎస్‌డీఈ సక్రు, జేటీఓ అశోక్, సందీప్, ఆఫీస్ సూపరింటెండెంట్ శివరాంజీ, జేఈ జైపాల్‌రెడ్డి, మాన్‌సింగ్, నిరంజన్, రాంకుమార్, మురళి పాల్గొన్నారు.

లింక్ కెనాల్ పనుల్లో వేగం పెంచాలి



ఎన్నెస్పీ కాల్వను పరిశీలిస్తున్న అధికారులు

ఏన్కూరు: గోదావరి జలాల తరలింపునకు నిర్దేశించిన సీతారామ ప్రాజెక్టులో భాగమైన లింక్ కెనాల్ పనుల్లో వేగం పెంచాలని ప్రాజెక్టు సీఈ విద్యాసాగర్ ఆదేశించారు. ఏన్కూరు మండలం నూకలంపాడు, శ్రీరామగిరి, బురదరాఘవాపురం, ఆరికాయలపాడు, పీకే బంజరల్లో ఎన్నెస్పీ కాల్వలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ.. సీతారామ లింక్ కెనాల్ పనులను ఆగస్టు 15 నాటికి పూర్తి చేసి నీరు విడుదల చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ అనన్య, నాయకులు గుత్తా వెంకటేశ్వరరావు, మేడ ధర్మారావు, యండ్రాతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ దామోదర్‌రావు

భద్రాచలం: గోదావరి వరదలపై ముందస్తు చర్యలు చేపట్టేందుకు అధికారులు, సిబ్బంది తగిన ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని భద్రాచలం ఆర్‌డీఓ దామోదర్‌రావు అన్నారు. మంగళవారం భద్రాచలంలోని సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ విపత్తుల స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) అధికారుల సమక్షంలో ఏడు మండలాల తహసీల్దార్లు, సెక్టోరియల్, పోలీస్ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గోదావరి వరదలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవగాహన సదస్సులు నిర్వహించాలని, అందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పాటు ఇతర శాఖలు సంయుక్తంగా పనిచేయాలని సూచించారు. అవగాహన సదస్సులు నిర్వహించేందుకు తహసీల్దార్లు తేదీలను ఖరారు చేసి అధికారులకు సమాచారం ఇవ్వాలని, ముంపు ప్రాంత ప్రజలను భాగస్వాములు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్ భూపేందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

అన్నపురెడ్డిపల్లి: బంగారు ఆభరణాల చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం మండలంలోని కట్టుగూడెం గ్రామంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా, ఓ వ్యక్తి బైక్‌ను ఆపకుండా వెళ్లాడు. పోలీసులు అతడిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించారు. ఏపీలోని కృష్ణా జిల్లా వత్సవాయి మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన చింతల గోపాల్‌రావు.. ఈ నెల 10న బూర్గుగూడెంలో తాళం వేసి ఉన్న ఇంట్లో బంగారు నగలను చోరీ చేసినట్లు అంగీకరించాడు. వాటిని కొత్తగూడెంలో విక్రయించేందుకు తీసుకెళ్తూ పట్టుబడ్డాడు. నిందితుడి వద్ద నుంచి 7 గ్రాముల బంగారం, రూ.10,000 నగదు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

మోటార్లు చోరీ

ములకలపల్లి: వ్యవసాయ భూముల్లోని నాలుగు మోటార్లు చోరీకి గురికాగా, బాధితులు పోలీసులను ఆశ్రయించారు. రాచన్నగూడెంకి చెందిన బాధిత రైతులు మిడియం గోపాల్‌రావు, కీసరి బాబూరావు, మిడియం ఎల్లయ్య, మిడియం రాము మాట్లాడుతూ.. తమకు రాచన్నగూడెం శివారులో 40 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, నాలుగు బోర్లు వేసి, మోటార్లు అమర్చి వ్యవసాయం చేస్తున్నామన్నారు. మంగళవారం ఉదయం చేలలోకి వెళ్లగా మోటార్లు చోరీకి గురైనట్లు తెలిసిందని, కేసింగ్ పైపును కోసి, ట్రాక్టర్ సాయంతో మోటార్లు బయటకు లాగినట్లు ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు. రూ.4 లక్షల విలువైన మోటార్లు చోరీకి గురయ్యాయని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వారు వెల్లడించారు.

దంపతులపై కేసు

సుజాతనగర్: పొలం సరిహద్దు విషయంలో వివాదం కారణంగా దంపతులపై దాడికి పాల్పడిన దంపతులపై స్థానిక పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ జుబేదాబేగం కథనం ప్రకారం.. మండలంలోని రూప్లాతండా గ్రామానికి చెందిన బానోత్ బిక్నా, తులసి దంపతులకు అదే గ్రామానికి చెందిన బానోత్ లక్ష్మా, విజయ దంపతులకు మధ్య కొంతకాలంగా పొలం సరిహద్దు విషయంలో గొడవలు తలెత్తుతున్నాయి. మంగళవారం బిక్నా దంపతులు పొలంలో పనులు చేసుకుంటుండగా లక్ష్మా దంపతులు గొడవకు దిగి దాడికి పాల్పడ్డారు. బిక్నా ఫిర్యాదు మేరకు లక్ష్మా, విజయ దంపతులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేసు నమోదులో ఆలస్యం

కొత్తగూడెంఅర్బన్: సస్పెండైన ఉపాధ్యాయురాలిపై విచారణ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ మంగళవారం ఎలాంటి కేసు నమోదు కాలేదు. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెం పట్టణం బూడిదగడ్డ ప్రభుత్వ పాఠశాలలో ఎయిడెడ్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న టి.పద్మావతిపై వివిధ ఆరోపణలు, ఫిర్యాదులు అందటంతో విచారణ అధికారిగా జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు ఏడాది పాటు విచారణ జరిపి ఇటీవల జిల్లా కలెక్టర్‌కు నివేదికను అందజేశారు. పరిశీలించిన కలెక్టర్, పద్మావతిని సస్పెండ్ చేసి కేసు నమోదు చేయాలని ఆదేశించినట్లు విచారణ అధికారి తెలిపారు. దీంతో విచారణ అధికారి సస్పెండ్ ఉత్తర్వులను పద్మావతి పనిచేసేపాఠశాలకు, త్రీటౌన్ పోలీసులకు అందజేశారు. అందులో విచారణకు సంబంధించిన నివేదిక లేనికారణంగా త్రీటౌన్ పోలీసులు కేసును వాయిదా వేశారు. విచారణ అధికారిని బుధవారం పోలీస్ స్టేషన్‌కు రప్పించి ఆయన ఇచ్చే ఆధారాలు, ఫిర్యాదుపై కేసు నమోదు చేస్తామని పోలీసులు వెల్లడించారు.

బెదిరింపులకు పాల్పడిన ముగ్గురిపై కేసు

కొత్తగూడెంటౌన్: హత్యకు గురైన మహిళ భర్తపై తప్పుడు కథనాలు రాస్తామని జర్నలిస్టులుగా చెప్పుకున్న ముగ్గురు బెదిరించి డబ్బు డిమాండ్ చేయగా వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తగూడెం సన్యాసిబస్తీకి చెందిన దాసరి పూర్ణపై ఆమె భర్త శ్రీనివాసరావు దాడి చేయడంతో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి కన్నుమూసింది. కుటుంబీకులు సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తుండగా వారి ఇంటికి వెళ్లిన రమేశ్, గణేశ్, కృష్ణమూర్తి జర్నలిస్టులుగా పరిచయం చేసుకు న్నారు. శ్రీనివాసరావుకు వివాహేతర సంబంధాలు ఉన్నట్లు రాయొద్దంటే డబ్బు ఇవ్వాలని ఆయన కుమారుడు కార్తీక్‌ను బెదిరించారు. అంతేకాక శ్రీనివాస్ అనే వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడించారు. ఈ మేరకు కార్తీక్ ఫిర్యాదుతో ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

పాల్వంచరూరల్: మండలంలోని రేపల్లెవాడకు చెందిన వ్యవసాయ కూలీ గంగుల తిరపతయ్య.. కుటుంబ కలహాల నేపథ్యంలో గత మే 18వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. మంగళవారం ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

వృద్ధురాలిని ఢీకొట్టిన ఆటో

కొత్తగూడెంఅర్బన్: మెడిసిన్ తెచ్చుకోవడానికి సింగరేణి ఆస్పత్రికి వెళ్తున్న వృద్ధురాలిని ఆటో ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. గరీబ్‌పేటకు చెందిన పెద్ది కొమరమ్మ మేదరబస్తీలోని తన కుతూరు ఇంటికి వచ్చింది. మంగళవారం సింగరేణి ఆస్పత్రిలో మందుల కోసం వెళ్తున్న క్రమంలో గణేశ్ టెంపుల్ ఏరియాలో రామవరానికి చెందిన ఆటోడ్రైవర్ టేకుల రమేశ్ కొమరమ్మను ఢీకొట్టాడు. ఆమె తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు సింగరేణి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కొమురమ్మ కుమారుడు రవి ఇచ్చిన ఫిర్యాదుతో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు వ్యక్తుల రిమాండ్

సుజాతనగర్: కోర్టు నోటీసులకు హాజరుకాని ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ జుబేదా బేగం కథనం మేరకు.. మండలంలోని స్టేషన్ బేతంపూడి గ్రామానికి చెందిన బానోత్ లాలు, నాయకులగూడెం గ్రామానికి చెందిన చింతల వీరారావుపై గతంలో వేర్వేరు కేసులు నమోదయ్యాయి. న్యాయస్థానంలో హాజరుకావాలని పలుమార్లు వీరికి నోటీసులు వచ్చినా హాజరుకాలేదు. దీంతో న్యాయస్థానం ఆదేశాల మేరకు సదరు వ్యక్తులను కోర్టు ఎదుట హాజరుపరిచి భద్రాచలం జైలుకు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

నంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్ స్వాధీనం



నంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్‌తో ట్రాఫిక్ పోలీసులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలో మంగళవారం నంబర్ ప్లేట్ లేకుండా కూనవరం రోడ్డులో వెళ్తున్న ఓ ట్రాక్టర్‌ను ట్రాఫిక్ ఎస్‌ఐ మధుప్రసాద్ అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్‌ను ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, యజమానులు తమ ట్రాక్టర్లకు అన్నివైపులా రేడియం స్టిక్కర్లు వేయించుకోవాలని, రాత్రి సమయాల్లో జరిగే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

వరకట్న వేధింపులపై ఫిర్యాదు

ఇల్లెందురూరల్: అదనపు కట్నం కోసం భర్త, అతని కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ మండలంలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన ఇర్ప లత మంగళవారం కొమరారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం ప్రకారం.. మర్రిగూడెం గ్రామానికి చెందిన ఇర్ప లతకు తొర్రూరు మండలం అమ్మాపురం శివారులోని కొత్తగూడెం గ్రామానికి చెందిన ప్రముఖ గాయకుడు రాంబాబుతో హైదరాబాద్‌లో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. నాలుగు సంవత్సరాలపాటు ప్రేమించుకున్న ఇరువురు రాంబాబు కుటుంబ సభ్యుల సమక్షంలో యాదగిరిగుట్ట ఆలయంలో 2024 జనవరిలో వివాహం చేసుకున్నారు. యాదగిరిగుట్టలోనే ఇంటిని అద్దెకు తీసుకొని కాపురం చేశారు. ఈ క్రమంలో రాంబాబుతోపాటు అతని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వరకట్నం కావాలని, తెస్తేనే ఇంట్లో ఉండనిస్తామని వేధించారని, తాను స్పందించకపోవడంతో ఇంటి నుంచి వెళ్లగొట్టారని లత వాపోయింది. ఈ మేరకు కొమరారం పోలీసులకు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ సోమేశ్వర్ తెలిపారు.

వేధింపుల కేసులు నమోదు

భద్రాచలంఅర్బన్: పలు కారణాలతో తమను భర్త, అత్తింటివారు మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నారని ఇద్దరు వివాహితలు ఫిర్యాదు చేయగా పోలీసులు మంగళవారం కేసులు నమోదు చేశారు. అశోక్‌నగర్‌కాలనీకి చెందిన కంభం భవానికి 2017లో రాముతో వివాహమైంది. ఇటీవలికాలంలో భవానిపై అనుమానంతో రాము నిత్యం వేధిస్తున్నాడు. కంభం భవాని ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేశారు. అలాగే, పట్టణంలోని శాంతినగర్‌కాలనీకి చెందిన గాళ్ల లక్ష్మీభవానీకి 2015లో జంగారెడ్డిగూడేనికి చెందిన ప్రవీణ్‌తో వివాహమైంది. ఇటీవల మద్యానికి బానిసైన ప్రవీణ్ అదనపు కట్నం కోసం తల్లి విజయలక్ష్మితో వేధింపులకు గురిచేస్తుండగా లక్ష్మీభవానీ ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్‌ఐ పీవీఎస్‌రావు కేసు నమోదు చేశారు.